
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
మంగళవారం 19 ఆగస్టు 2025

3.6 కేజీల గంజాయి పట్టివేత

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని సింప్లేక్స్ వద్ద 3.6 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ పట్టణానికి చెందిన మహేష్, ఏపీ, ప్రకాశం జిల్లా సింగారాయికొండాకు చెందిన మన్నే వంశీ బతుకుదెరువు కోసం గత కొంత కాలంగా శంషాబాద్ రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారు. సింప్లేక్స్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3.686 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ దాదాపు రూ.92 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా గరుడ వాహన సేవ 7

గోవింద నామస్మరణతో మార్మోగిన చిలుకూరు ఆలయం

పింఛన్లు పెంచకపోతే మహాగర్జన

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 7

కమిషనర్‌ను తొలగించాలి

మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకుల ఆందోళన 7


మొయినాబాద్: ఈసీవాగు పొంగడంతో నీట మునిగిన పూలతోట

వీడని వాన!

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వాన పడటంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. జంట జలాశయాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లో వరదనీరు చేరింది. ఈసీ, మూసీ వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.


అలుగుపారుతున్న షాబాద్ పహిల్వాన్ చెరువు

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు
- పొంగిపొర్లుతున్న ఈసీ, మూసీ
- నీటమునిగిన పంటలు.. రోడ్లన్నీ బురదమయం
- కేశవరంలో అత్యధికంగా 109.0 మి.మీ.వర్షపాతం

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలోని దేవరాంపల్లి, షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, మొయినాబాద్ మండలంలోని వెంకటాపూర్, శంకర్‌పల్లి మండలం ఫత్తేపూర్ వాగు ఉధృతి పెరిగింది. షాబాద్ పహిల్వాన్ చెరువుతో పాటు చందనవెల్లి చెరువు అలుగు పారుతుంది. పెదవేడులోని ఈదమ్మ చెరువులోకి నీరు చేరింది. నాగర్‌గూడ ఈసీ వాగు జోరుగా ప్రహిస్తుంది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో మొలకెత్తిన పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూరగాయ పంటలతో పాటు మొక్కజొన్న, పత్తి పంటలు నీట మునిగాయి. మొయినాబాద్ మండలం వెంకటాపూర్ వాగు ఉధృతికి లోతట్టు ప్రాంతాల్లోని కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్, అమడాపూర్, నాగిరెడ్డిగూడ, బాకారం గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తోజపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణ చిన్నపాటి వర్షానికే కుంటను తలపిస్తోంది. పాఠశాల ఆవరణ నీటితో నిండిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లకాలంగా వర్షా కాలంలో ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. యాచారం మండలంలో మట్టి రోడ్లన్నీ బురదమయంగా మారాయి. కుర్మిద్దలో రోడ్డుపై పోసిన ఎర్రమట్టితో జనం

మిగతా 8వ పేజీలో...


మొయినాబాద్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఈసీ వాగు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శనీయుడు

కలెక్టర్ నారాయణరెడ్డి


పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవలు ట్యాంక్ బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనుండటం హర్షణీయమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. తెలంగాణ బహుజన రాజ్య స్థాపకుడు పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాపన్నగౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పాపన్నగౌడ్ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ గడ్డపై దళిత బహుజన మైనార్టీలతో కలిసి ప్రజారాజ్యాన్ని నిర్మించారని కొనియాడారు. కుల మతాల వివక్ష లేకుండా అన్నివర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని పోరాటం చేశారన్నారు. జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఏవైనా సమస్యలు ఉంటే దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా బీసీ విద్యార్థులకు విద్యలో నైపుణ్యం కోసం ప్రత్యేకంగా శిక్షణా తరగతులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌వో సంగీత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురాం, బీసీ ఫ్రంట్ నాయకుడు, మల్లేష్ యాదవ్, సుధాకర్‌గౌడ్, అనిల్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 70 ఫిర్యాదులు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 70 ఫిర్యాదులు రాగా, అందులో రెవెన్యూ శాఖ నుంచి అత్యధికంగా 39, మున్సిపల్ శాఖ నుంచి 6, విద్యాశాఖకు 9, ఇంటర్మీడియెట్ బోర్డుకు 6, సివిల్ కోర్టు 1, డీఆర్‌డీఏకు 2, ఎంపీడీవోకు 1, పంచాయతీరాజ్‌కు 2, హౌజింగ్ శాఖకు 1, వ్యవసాయశాఖకు ఒక దరఖాస్తు వచ్చింది.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఒక్క ఎరువు బస్తా కూడా అక్రమంగా జిల్లా సరిహద్దులు దాటి వెళ్లకుండా గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. సొసైటీల్లో ఎరువుల స్టాక్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రైవేట్ విక్రయ కేంద్రాలను కూడా మండల వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేసేలా చూడాలని తెలిపారు. ఎక్కడైనా ఎరువుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడటం, బ్లాక్ మార్కెట్‌కు తరలించడం, నిర్ణీత ధర కంటే ఎక్కువ విక్రయాలు జరిపితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. టెలీకాన్ఫరెన్స్‌లో వ్యవసాయాధికారి, మార్కెటింగ్‌శాఖ అధికారి, పరిశ్రమలశాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు


మాట్లాడుతున్న సుధీర్‌బాబు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. సోమవారం రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి జిల్లాలకు సంబంధించి గణేష్ ఉత్సవాల నిర్వహణపై అదనపు కలెక్టర్లు, డీసీపీలు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, వాటర్ వర్క్స్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు నిర్వహించే గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధించి నిబంధనలకు లోబడి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. నిమజ్జనం చేసే సమయంలో చెరువుల వద్ద లైటింగ్, క్రేన్లు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో భువనగిరి అదనపు కలెక్టర్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, మహేశ్వరం డీజీపీ, సునీతరెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కవిత


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వర్షం కురుస్తున్నా.. గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీప్రైమరీ పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని, విద్యాబోధన బాధ్యతకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఇవ్వాలని, విద్యా వలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అదనంగా చెల్లించాలని కోరారు. ఐసీడీఎస్‌కు సంబంధంలేని బీఎల్‌వో తదితర అదనపు పనులను రద్దు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ సూపరింటెండెంట్ సీతారాం



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, వీటికి బానిసైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ సూపరింటెండెంట్ పి.సీతారాం అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యా సంస్థల్లో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, విక్రయించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం కృషి చేసి మంచి ఫలితాలు రాబట్టాలని ఆయన సలహా చేశారు.కార్యక్రమంలో డీఎస్పీ సైదులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ కె.వెంకట్రావు, డైరెక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ, ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌పి యాదవ్, పార్థసారధి పాల్గొన్నారు.


రోడ్డుపై నుంచి పారుతున్న ఉమ్మెంత్యాల- లాలాపేట వాగు

వాగు దాటేదెలా?


సిమెంట్ పైపులకే పరిమితమైన వెంకిర్యాల బ్రిడ్జి

అర్ధంతరంగా నిలిచిన వంతెనల నిర్మాణం ● రోడ్లపై పారుతున్న వాగులు
చేపట్టిన పనులు, నిధులు వర్షార్పణం ● ప్రజల రాకపోకలకు అవస్థలు

షాద్‌నగర్/కొందుర్గు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నియోజకవర్గ పరిధి ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.20కోట్లు నిధులు మంజూరు.. రూ.2కోట్లతో పనులు ప్రారంభం.. కొందుర్గు మండలం తంగళ్లపల్లి- వెంకిర్యాల గ్రామాల మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.20కోట్లు మంజూరు.. రూ.20లక్షలతో పనులు ప్రారంభం.. కానీ ఈ పనులన్నీ పూర్తయ్యాయని అనుకుంటే పప్పులో కాలేసినట్లే. ఇవన్నీ అర్ధంతరంగా నిలిచిపోయాయి. కాస్తోకూస్తో చేపట్టిన పనులు కూడా భారీ వర్షాలకు కారణంగా కొట్టుకుపోయి నిధులు దుర్వినియోగమయ్యాయి.

అయ్యవారిపల్లి వాగు..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగుపై 2023లో రూ.4.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం కోసం అప్పటి బీఆర్‌ఎస్ రాష్ట్ర సర్కారు నిధులు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించింది. సదరు కాంట్రాక్టర్ వాగుకు ఇరుపక్కల సిమెంట్‌తో భారీ ప్రహరీలను నిర్మించాడు. పనులు సవ్యంగా సాగుతున్నాయనుకుంటున్న సమయంలో బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో రెండేళ్లుగా బ్రిడ్జి నిర్మాణం ఆగిపోవడంతో ఇటీవల కురుస్తున్న

మిగతా 8వ పేజీలో...

ఎమ్మెల్యే చొరవ చూపాలి



వర్షాకాలంలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్థంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారాల తరబడి ఇంటికే పరిమితం అవుతుండటంతో పూటగడవడం కష్టతరమవుతుంది. ఎమ్మెల్యే చొరవ చూపి వాగులపై బ్రిడ్జిలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి.

- లింగం గౌడ్, కొందుర్గు

అమ్మోరికి బోనం.. అంబరాన్నంటిన సంబురం

కడ్తాల,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలో సోమవారం పోచమ్మ బోనాల వేడుకను వైభవంగా జరుపుకున్నారు. సాయంత్రం మహిళలు బోనం కుండలను అలంకరించుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ర్యాలీలో అమ్మవారి వేషధారణ, ఫలహార బండి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. 20ఫీట్ల తొట్టెల, నరసింహ స్వామి విగ్రహంతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. బోనాల వేడుకల్లో ఢిల్లీ నుంచి వచ్చిన కళాకారులు అఘోరాల వేషధారణలో సందడి చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహ్మారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్, యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, పోచమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ ఏ. సత్యం యాదవ్ పాల్గొన్నారు.




కడ్తాలలో తొట్టెల ఊరేగింపు

హనుమంతుడి చరిత్ర స్ఫూర్తి మంత్రం

త్రిదండి అహోబిల పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి

చేవెళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : హనుమంతుని చరిత్ర ప్రపంచానికి స్ఫూర్తి మంత్రమని త్రిదండి అహోబిల పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని తంగడ్‌పల్లి గ్రామంలో ఆరు రోజులపాటు నిర్వహిస్తున్న అభయాంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. వేడుకలకు హాజరైన రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ.. యువకులంతా హనుమంతున్ని ఆదర్శంగా తీసుకుని దేశ రక్షణకు కృషి చేయాలన్నారు. గోమాతను పూజిస్తే అంతా శుభమే కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 35 మంది యువకులు హనుమన్ మాలధారణ గావించి స్వామివారికి సేవలు అందించారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పర్మయ్యగౌడ్, అనూష, బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు రాములుగౌడ్, సత్యయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, చంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.




విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో త్రిదండి అహోబిల పీఠాధిపతి రామానుజ జీయర్ స్వామి, పాల్గొన్న భక్తులు



పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లిస్తాం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సోమవారం వచ్చిన పలువురు పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డబుల్ ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, పనులు పూర్తి చేసి త్వరలోనే పేదలకు అందిస్తామని తెలిపారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న పేదలు



విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఉపాధ్యాయులు తమ వంతుగా కృషి చేయాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రాంరెడ్డి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఉప్పరిగూడ క్రాస్ రోడ్డు మైదానంలో రెండ్రోజులపాటు నిర్వహించిన వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, డ్రగ్స్‌లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులపై శ్రద్ధ చూపాలని, ఎంచుకున్న లక్ష్యం కోసం నిరంతరం శ్రమించినప్పుడే భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 44 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1,320 మంది విద్యార్థులు హాజరయ్యారు. 142 టీంలు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నాయి. బాలికల వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ యాచారం మొదటి స్థానంలో నిలువగా జెడ్పీహెచ్‌ఎస్ రంగాపూర్ రెండో స్థానంలో నిలిచాయి. బాలుర వాలీబాల్‌లో జెడ్పీహెచ్‌ఎస్ రంగాపూర్ మొదటి స్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ జాపాల రెండో స్థానంలో నిలిచాయి. బాలికల కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ రాయపోల్ మొదటి స్థానంలో, ఇబ్రహీంపట్నం బాలికల ఉన్న పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. అలాగే బాలుర కబడ్డీలో జెడ్పీహెచ్‌ఎస్ రాయపోల్ మొదటి స్థానంలో, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల రెండో స్థానంలో నిలిచాయి. బాలికల ఖోఖోలో జెడ్పీహెచ్‌ఎస్ చింతపట్ల మొదటి స్థానంలో, జెడ్పీహెచ్‌ఎస్ దండుమైలారం రెండో స్థానంలో నిలిచాయి. బాలుర ఖోఖోలో జెడ్పీహెచ్‌ఎస్ చింతపట్ల మొదటి స్థానంలో, టీపీఎస్ అరుట్ల రెండో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా ఉప్పరిగూడ గ్రౌండ్ నుంచి శేరిగూడ వరకు క్రీడాకారులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు.


ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు షీల్డుతోపాటు బహుమతులు అందజేస్తున్న బూడిద రాంరెడ్డి

మొగిలిగిద్ద పాఠశాలలో

అభివృద్ధి పనులు ప్రారంభించండి

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్సీ కోదండరాంతో కలిసి విద్యా కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జనవరి 30న సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్ద గ్రామాన్ని సందర్శించారని తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేశారు. అలాగే రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, 11 మంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపుతున్నారని, ఆ డిప్యూటేషన్లు నిలిపివేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ నిధులు మంజూరుకు నాబార్డు అధికారులతో మాట్లాడారు. మొగిలిగిద్ద పాఠశాలను సందర్శించి సమాచారం సేకరించాలని డీఈఓను ఆదేశించారు. కేజీబీవీలో అదనపు కోర్సు మంజూరు చేయాలని కోరారు. గ్రామస్తులు శ్యాం సుందర్, రాజు, దయాసాగర్ ఉన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ కోదండరాం, గ్రామస్తులు

అట్టహాసంగా వాలీబాల్ పోటీలు


ఇబ్రహీంపట్నం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో అండర్-15 బాలబాలికల 69వ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరగనున్న ఈటోర్నీని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రారంభించారు. ములుగు జిల్లా మినహా 32 జిల్లాల నుంచి 768 మంది క్రీడాకారులు, 128 మంది కోచ్ మేనేజర్లు ఈటోర్నీలో పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ ఈ క్రీడలకు ఆతిథ్యమిచ్చిన గురుకుల విద్యాపీఠ్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 25 నుంచి పూణేలో జరుగబోయే జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. కార్యకమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠ్ ప్రిన్సిపాల్ డి.శ్రీనపివాస్‌రావు, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.రాఘవరెడ్డి, క్రీడల అబ్జర్వర్ వెంకట్‌నారాయణ పాల్గొన్నారు.



బెలూన్లు ఎగరవేసి క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో సుశీందర్‌రావు తదితరులు

మంతన్‌గౌరెల్లి పాఠశాలకు భవనాలు నిర్మించాలి

యాచారం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంతన్‌గౌరెల్లిలో ప్రైమరీ పాఠశాల తరగతి గదులు పూర్తిగా శిథిలమయ్యాయని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు చందూనాయక్, భాస్కర్‌నాయక్, జంగయ్య, రవి అన్నారు. పాఠశాల భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొందని, తక్షణమే భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పూర్ణచందర్‌రావు., కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు థావ్‌నాయక్, గణేష్ తదితరులున్నారు.







కేబుల్ వైర్ల తొలగింపు

- నిలిచిన ఇంటర్నెట్ సేవలు
- కేబుల్ ఆపరేటర్ల నిరసన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 18 (ఆంధ్ర జ్యోతి): అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్ వైర్లను సోమవారం విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. ఇటీవల నగరంలోని రామంతపూర్ ఘటన నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు అనధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించడానికి విద్యుత్ శాఖ అధికారులు రంగంలో దిగారు. ఈ క్రమంలో మేడ్చల్ పట్టణంలోని వీధుల్లో, కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు కుప్పలు తెప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించారు. దీంతో పట్టణంలో కేబుల్ ద్వారా సరఫరా అయ్యే ఇంటర్నెట్ సేవలు, కేబుల్ ఛానళ్ల ప్రసారం పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న కొందరు కేబుల్ ఆపరేటర్లు విద్యుత్‌శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. లక్షల రూపాయలు విలువ చేసేకేబుల్‌లను తొలగించడంపై మండిపడ్డారు. ఈ విషయమై మేడ్చల్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు వ్యక్తులు కేబుళ్లను ఏర్పాటు చేయడానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. నిబంధనకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన కేబుళ్లను తొలగించామని తెలిపారు. ఇదిలా ఉండగా, విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా కేబుల్ వైర్లను తొలగించటాన్ని నిరసిస్తూ మంగళవారం(నేడు) స్థానిక ప్రైవేటు కేబుల్ ఆపరేటర్లు నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు.


స్తంభాల నుంచి కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది



రాకపోకలను పునరుద్ధరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అరునెలలుగా అక్రమంగా రోడ్డును మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే రాకపోకలను పునరుద్ధరించాలని రెడ్డి కాలనీవాసులు డిమాండ్ చేశారు. తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్‌యాదవ్ ఆధ్వర్యంలో రెడ్డి కాలనీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఆ కాలనీవాసులు తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రెడ్డి కాలనీలో గల వెంచర్ లేఅవుట్‌లోని రోడ్డును ఆక్రమించుకున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేదంటే కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎద్దు నాగేశ్‌యాదవ్, రెడ్డి కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి ఉన్నారు.



ఆందోళన చేస్తున్న రెడ్డి కాలనీవాసులు, నాగేశ్‌యాదవ్



వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

వికారాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకుని వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. ఈ వేడుకను వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు రుద్రాభిషేకం, దాత సహకారంతో నిర్మించిన షెడ్‌ను ప్రారంభించారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవానికి భక్తులుతరలిరాగా, వీరశైవ సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ముగిసిన సిద్దులగుట్ట బ్రహ్మోత్సవాలు



రాంచందర్‌రావు, పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, తోకల శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

శంషాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శ్రీ వెండికొండ సిద్దేశ్వరస్వామి(సిద్దులగుట్ట) బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు పంతంగిరాజ్ భూపాల్‌గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని పూలమాలలతో సన్మానించారు. తెల్లవారుజామున ఆలయ ప్రధాన పూజారి మాదుపతి నరేందర్ నిర్వహించిన అగ్నిగుండాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పూజారులు నందీశ్వర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

తాండూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వైద్యాధికారులకు సూచించారు. సోమవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవికి, తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునితతో ఫోన్‌లో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల గురించి ఆరా తీశారు. డెంగ్యూ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందని దీనిపై అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. మందుల కొరత ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలియజేశారు.

బంగారు తాపడ నాగాభరణం విరాళం



నాగాభరణం అందజేస్తున్న సాద నర్సింహా రెడ్డి కుటుంబ సభ్యులు

కీసర, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్ట ఆలయానికి సిక్‌విలేజ్‌కు చెందిన సాద నర్సింహారెడ్డి పుష్పలత దంపతులు బంగారు తాపడ నాగాభరణం సోమవారం విరాళంగా అందజేశారు. రూ.6.50లక్షల విలువచేసే బంగారు తాపడ నాగాభరణం అందజేయడం అభినందనీయమని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. దాతలు స్వామివారికి నాగభరణంతో శ్రీమహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో ఆలయ నిర్వాహకులకు నాగాభరణం అందజేశారు. అదే విధంగా శ్రావణ మాసం పురస్కరించుకొని చివరి సోమవారం కావడంతో భక్తులు అధికసంఖ్యల్లో విచ్చేసి స్వామివారికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు జూపల్లి సాయిలు, కందాడి రాజిరెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్, నల్లా మధుసూదన్‌రెడ్డి, పోశబోయిన రాజు యాదవ్, కె.కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకుడు బలరాం శర్మ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం



సమావేశంలో నివేదికలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

బొంరాస్‌పేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 47 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అధికారులు నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన వివిధ పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు తనిఖీ చేసిన నివేదికను బహిరంగ సమావేశంలో వివరించారు. 10 పంచాయతీల నివేదికలను సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఉపాధిహామీ ఏపీడీ సరళ, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నర్సింహులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, ఎంపీడీవో వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

వైభవంగా గరుడ వాహన సేవ



చేవెళ్లలో వేంకటేశ్వర స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణ సోమవారం సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మార్మోగాయి. ప్రతి ఏడాది సంప్రదాయ పద్ధతిలో నిర్వహించే గంపజాతర సోమవారం ఘనంగా జరిగింది. చేవెళ్ల గ్రామస్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలోనే వంటలు చేసుకుని రోజంతా గడిపారు. అనంతరం స్వామి వారిని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో దేవాయల ఫౌండర్ ట్రస్టీ దేవుని వామనాచార్యులు, ఈవో నరేందర్, సిబ్బంది సుకేందర్, పూజారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, అధికారులు

మేడ్చల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యూరియా కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు సోమవారం మంత్రి తుమ్మల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా సరఫరా పరిస్థితులను వివరించారు. యూరియా నిల్వలపై పటిష్ఠ పర్యవేక్షణ తీసుకుంటున్నామన్నారు. యూరియా వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. డీలర్లపై ప్రత్యేక దృష్టిపెట్టి తగినచర్యలు చేపడుతున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో హరిప్రియ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ సంబురాలు



ఘట్‌కేసర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో గల బ్యూటినెస్ట్ కాలనీలో ఆదివారం రాత్రి తీజ్ సంబురాలు ఘనంగా నిర్వహించారు. గిరిజనుల్లోని వివాహం కాని యువతులు ఈవేడులకను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ధాన్యపు బుట్టలను(బతుకమ్మలను) చెరువులో నిమజ్జనం చేస్తారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నృత్యాలు చేస్తూ భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. రవినాథ్, పురుషోత్తం నాయక్, రాములు నాయక్, నెహ్రూ నాయక్, మోతీలాల్ నాయక్, డీజీ నాయక్, ఉమ్లా నాయక్, కిరణ్, సంతోష్, చిట్టిబాబు, నరేష్ పాల్గొన్నారు.

కనుల పండువగా రామలింగేశ్వర జాతర

● భక్తిశ్రద్ధలతో రథోత్సవం ● హాజరైన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

బషీరాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన మండలంలోని నీళ్లపల్లి అటవీ ప్రాంతంలో ఏడుకొలనుల మధ్య వెలసిన ఏకాంబర రామలింగేశ్వరుడి జాతరకు భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం చివరి సోమవారం నిర్వహించే ఈ జాతరకు భక్తులు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో జాతరలో భక్త జనసందోహం నెలకొంది. ఈ ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడి రామలింగేశ్వరుడి దర్శనం అనంతరం భక్తులు ఆలయం పక్కనే కొలువై ఉన్న యాకుబ్‌సాబ్ దర్గాను కోనేటి నీటిలోంచి వెళ్లి దర్శించుకున్నారు. ధర్మదర్శనం, ప్రత్యేక దర్శనాలకు క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఈ ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ చైర్మన్ పి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి పరమశివుడి విగ్రహం, కలశాన్ని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం మహాశివుడి విగ్రహంతో రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉత్సవాలకు తెలంగాణ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్సీ పి.మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తండ్రి విఠల్‌రెడ్డి హాజరవగా, ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలకు చైర్మన్, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. సుధాకర్‌రెడ్డి, రుక్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యానాయక్, వీరారెడ్డి, రామక్రిష్టారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కరుణం పురుషోత్తంరావు, అజయ్‌ప్రసాద్, ఎస్.వెంకటేష్, చందర్‌నాయక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



జినుగుర్తిలో పూజలందుకున్న రామలింగేశ్వరస్వామి



అంబురామేశ్వర ఆలయంలో ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి



రథోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

వైభవంగా అంబురామేశ్వర స్వామి జాతర

పెద్దేముల్: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తట్టెపల్లి సమీపంలోని శ్రీఅంబురామేశ్వర స్వామి జాతర వైభవంగా జరిగింది. ఉత్సవాలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వికారాబాద్ జిల్లా వాసులే కాకుండా పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం నుండి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. రోజంతా మోస్తరు వర్షం కురుస్తున్నా భక్తులు స్వామివారి దర్శనానికి పోటెత్తారు. అంబురామేశ్వరస్వామిని ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్, సొసైటీవైస్‌చైర్మన్ అంజిలయ్య, నాయకులు గోపాల్, అంజయ్య, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

జినుగుర్తి మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు

తాండూరు రూరల్: జినుగుర్తి రామలింగేశ్వరస్వామి ఆలయం 42వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహరెడ్డి వేర్వేరుగా స్వామివారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ ప్రతినిధులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధారాసింగ్, పురుషోత్తంరావు, ఉత్తంచంద్, రవీందర్‌గౌడ్, వడ్డె శ్రీనివాస్, రాంలింగారెడ్డి పాల్గొన్నారు.

పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్

శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

కేశంపేట/చేవెళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మొఘల్ సుబేదార్లు చేస్తున్న అరాచకాలకు ఎదురొడ్డి బడుగు జీవుల పక్షాన పోరాడిన యోధుడు సర్వాయి సర్దార్ పాపన్న గౌడ్ అని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని కేశంపేట మండలం సంగెం గ్రామంలో జావాజీ నాగభూషణం గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని సోమవారం స్వామి గౌడ్, తూళ్ల వీరేందర్ గౌడ్ ప్రారంభించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత సైన్యం ఏర్పాటు చేసుకొని సుబేదార్లపై తిరుగుబాటు చేసి వరంగల్ ప్రాంతాన్ని 30 సంవత్సరాలు ఏలిన ఘనత పాపన్నదేనని గుర్తుచేశారు. కార్యక్రమంలో కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, అశోక్ గౌడ్, బుర్ర తిరుమలేష్ గౌడ్, పెండ్లిమడుగు వంశి, కందూరి చౌదరయ్య గౌడ్, పుండరీకం గౌడ్, మహేందర్ గౌడ్, నట్లపల్లి మహేందర్, అనీల్ గౌడ్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్ల మున్సిపాల్ అధ్యక్షుడు బుయ్యాని శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన చేవెళ్ల మండల కేంద్రంలోని పాపన్నగూడ్ విగ్రహానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, పార్టీల నాయకులతోపాటు ఆయా కుల సంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాలాలు వేసి నివాళులరిపంచారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు దేరవ వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ సేవలు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాజ్యలక్ష్మి, బాల్‌రాజ్, విజయలక్ష్మి, సున్నపు వసంతం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, రామస్వామి, సుధాకర్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.



కేశంపేట: మాట్లాడుతున్న స్వామిగౌడ్



చేవెళ్ల: పాపన్నగౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

మున్సిపల్ కమిషనర్‌ను తొలగించాలి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 18(ఆంధ్యజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డు కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఎగురవేయొద్దని ఆదేశాలు జారీ చేసిన కమిషనర్ మొయిజుద్దీన్‌ను పదవీ నుంచి తొలగించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కేఎస్ రత్నం డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని తొమ్మిది వార్డు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయనందుకు బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం అజీజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియంతపాలన సాగిస్తున్న కమిషనర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడంతో మొయినాబాద్ డిప్యూటీ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు అంజన్‌కుమార్ గౌడ్, గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఎల్లని వెంకటేష్ గౌడ్, తూర్పు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గౌడ హక్కుల పరిరక్షణ సమితి

జిల్లా కార్యదర్శిగా ముకుందంగౌడ్

చేవెళ్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ముకుందంగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు రేపట్ల మల్లేష్‌గౌడ్ చేతులు మీదుగా ముకుందం గౌడ్ నియామకపత్రం అందుకున్నారు. అలాగే చేవెళ్ల మండల అధ్యక్షుడిగా బొబ్బిలి కుమార్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందని, రాష్ట్ర నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు.

హరిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్

ఆమనగల్లు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లును హరిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిషనర్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో 50వేల పండ్లు, పూల మొక్కలను నాటాలనే లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6, 12 వార్డుల్లో సోమవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి కమిషనర్ ఇంటికి ఆరు చొప్పున మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు కావాల్సిన వారు స్థానిక మున్సిపల్ వార్డు అధికారులను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



బోనాల వేడుకల్లో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

కడ్తాల్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలకు బోనాలు ప్రతీకగా నిలుస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకకు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌తో కలిసి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. వివిధ వేషధారణలో ఆకట్టుకున్న కళాకారులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, మంగళపల్లి నరసింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి పవిత్రోత్సవం



పవిత్రమాలలతో మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింహులు, అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పెద్ద జానమ్మపేట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో మహాకుంభ ప్రోక్షణ, పవిత్రోత్సవ నాలుగో రోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు ఆలయ ప్రధాన గర్భగుడిలోని వేంకటేశ్వరుడి విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం యాగశాల నుంచి బక్కని నర్సింహులు,అంజయ్యయాదవ్‌తోపాటు పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి పవిత్ర మాలలు, రామాలయంలోని కళశాలను ఊరేగింపుగా తీసుకువచ్చి, గర్భగుడిలోని వేంకటేశ్వరుడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, బండారి రమేష్, గంధం ఆనంద్, ఈటె గణేష్, ఒగ్గు కిషోర్, ప్రతాప్‌రెడ్డి, కానుగు అంతయ్య, కక్కునూరి పెంటయ్య, గజవాడ నర్సింహులు, కానుగు రాంభూపాల్, లింగారం కుమార్‌గౌడ్, డాక్టర్ నాగవర్ధన్‌రెడ్డి, లష్కర్ అంజనేయులు, మధు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచకపోతే మహాగర్జన

● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

శంషాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 9వ తేదీలోగా పింఛన్లు పెంచకపోతే పరేడ్‌గ్రౌండ్‌లో పింఛన్‌దారులతో మహాగర్జన నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని బేగం ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన పింఛన్‌దారుల సభలో పాల్గొని మాట్లాడారు. పింఛన్లు పెంచుతామని గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నమ్మకద్రోహం చేశారని ఆరోపించారు. సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చకపోతె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. భూస్వాములకు రైతు భరోసా పేరుతో వేల కోట్లు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఉపేందర్, యాదగిరి, నరసింహ, భానుప్రసాద్, మహేష్, రత్నం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

మేడ్చల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లిలో అక్రమ భవన నిర్మాణాలకు సహకరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం గుర్రాల రాజు గ్రామ వాసి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి ఖాజీగూడ రెవెన్యూ శివారులో 12 నుంచి 17, 20, 25, 33 నుంచి 38 గల సర్వే నంబర్లలో 1.30 గుంటల భూమిని, పక్కన కొనుగోలు చేసిన తన భూమిలో కలిపి ఓ బిల్డర్ లేఔట్ చేసినట్లు బాధితుడు అధికారులకు మొరపెట్టుకున్నాడు. అడ్డుకునేందుకు వెళ్లిన తన కుటుంబసభ్యులపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయాడు. నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని హైకోర్టు ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా అధికారులు స్పందించిన్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

వీడని వాన!

(ఐదో పేజీ తరువాయి)

తంటాలు పడుతున్నారు. నందివనపర్తి వెళ్లే దారిలో రోడ్డుపై వర్షంనీరు నిలిచి మురుగు నీటితో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చౌదర్‌పల్లిలో ఇళ్ల మధ్య నీరు నిలిచి పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. యాచారంలో నందివనపర్తి వెళ్లేదారిలో ఉన్న మురుగు నీరు నిల్వకుండా ప్రత్యేకంగా సీసీ రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు.



అలుగు పారుతున్న చందన్‌వెల్లి పెద్ద చెరువు



చౌదర్‌పల్లిలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు

కేశవరంలో అత్యధికంగా...

ఉమ్మడి జిల్లాను ఎడతెరిపి లేని వాన చుట్టేసింది. గడిచిన 24 గంటల్లో మేడ్చల్ జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మూడు చింతలపల్లి మండలం ఈఎస్ఎస్ కేశవరంలో అత్యధికంగా 109.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో 95.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. ఘట్‌కేసర్ మండలం సింగాపూర్ టౌన్‌షిప్‌లో 82.3 మిల్లీమీటర్లు, మేడ్చల్ మండలంలోని ఇండస్ట్రియల్ పార్కులో 68.0 మిల్లీమీటర్లు, దుండిగల్‌లోని ఈఎస్ఎస్, డీపీపల్లిలో 63.3 మిల్లీమీటర్లు, కాప్రాలోని ఈఎస్ఎస్ మల్కారంలో 61.8 మిల్లీమీటర్లు, శామీర్‌పేట మండలం దేవరయంజాల్‌లో 61.0 మిల్లీమీటర్లు, బాచుపల్లిలో 57.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పెద్దఉమ్మెంతాల్‌లో అత్యధికంగా 50.0మిల్లీమీటర్లు, వికారాబాద్ మండలం ముద్గల్ చిట్టంపల్లి, వికారాబాద్‌లో 46.5 మిల్లీమీటర్లు, పరిగిలో 45.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో 42.8 మిల్లీమీటర్లు, షాబాద్ మండలం తాళ్లపల్లిలో 41.5 మిల్లీమీటర్లు, ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్దలో 43.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్రైం కార్నర్

శంకర్‌పల్లి ఎంపీడీవో సతీమణి ఆత్మహత్య

శంకర్‌పల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ సతీమణి ఉష(38) ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని హబ్సిగూడ నందనవనం కాలనీలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్ కుటుంబీకులతో నివాసముంటున్నారు. కాగా ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. వారికి ఇద్దరు కుమార్తెలు. ఆమె అంత్యక్రియలకు శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో పాటుగా పలువురు నాయకులు వెళ్లారు.

చీటింగ్ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

ఆదిభట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భూదాన్ భూమిలో ప్లాట్లు ఇప్పిస్తామంటూ 600 మంది వద్ద రూ.60 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం 15వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జడ్జ్ యశ్వంత్‌సింగ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్లు 67, 68 భూదాన్ భూమిలో దాదాపు 600 మందికి ప్లాట్లు ఇప్పిస్తామంటూ హైదరాబాద్ సింగరేణి కాలనీకి చెందిన పి.కృష్ణ, శంకర్‌నాయక్, రాజాగోపాల్, అమృతమ్మ, బాలాజీ, మరో వ్యక్తి కలిసి వారి నుంచి రూ.60 లక్షలు వసూలు చేసి బాధితులకు ప్లాట్లు ఇవ్వకపోవడంతో వీరిపై 2012లో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో బాధితులు జాహంగీర్ పాషా, మరికొంత మంది ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ రాంకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో ఆరుగురిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు, రూ.20 వేలు జరిమానా విధించారు.

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో భక్తులు

షాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సోలిపేట్‌లో సోమవారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టారు. గ్రామస్తులు శేఖర్‌రెడ్డి, గోపాల్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పరస్కరించుకొని మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో శ్రీ బుగ్గరామేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులు స్వామి వారికి తలంబ్రాలు పోయించారు. కల్యాణ తంతును వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, సభ్యులు సత్యనారాయణ, రాణమ్మ, సునీత, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, సుభాష్‌చంద్రబోస్, రంగదాస్, నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజయ్య, సత్తయ్యగౌడ్, కుమార్, నరేష్, వెంకటేష్, నర్సింహులు, బాల్‌రాజ్, రాజు, కుమార్, రమేష్ పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు



ఆమనగల్లు: నివాళులర్పిస్తున్న చుక్క అల్లాజీ గౌడ్, రవీందర్ గౌడ్

విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తూ జమీందార్లను ఎదురించి నిలిచిన సామాజిక విప్లవవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఎదుట ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కుల సంఘాలు, నాయకులు, ప్రజలు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకొని ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఆగస్టు 18



శంషాబాద్ రూరల్: గౌడ సంఘం ఆధ్వర్యంలో..



మొయినాబాద్ రూరల్: బాకారంలో..



నందిగామ:నివాళులర్పిస్తున్న నాయకులు



మొయినాబాద్‌లో..



కొందుర్గు: నివాళులర్పిస్తున్న నేతలు



షాద్‌నగర్‌రూరల్: కిషన్‌నగర్‌లో..



షాబాద్: నివాళులర్పిస్తున్న నాయకులు

వాగు దాటేదెలా?

(ఐదో పేజీ తరువాయి)

భారీ వర్షాలకు అయ్యవారిపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలు బంద్ అయ్యాయి. కొందుర్గు మండలం తంగళ్లపల్లి - వెంకిర్యాల వాగు మీద బ్రిడ్జి నిర్మాణం కోసం 2023లోనే రూ.3.20 కోట్లు మంజూరు కాగా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అతను వాగుకు ఇరువైపులా సిమెంట్ కాంక్రీట్‌తో నాలుగు పిల్లర్లను నిర్మించారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. బ్రిడ్జి నిర్మాణం కోసం తెచ్చిన సామాగ్రిని సైతం తీసుకువెళ్లి అదృశ్యమయ్యాడు. చేపట్టిన రూ.20లక్షల పనులు మొత్తం వర్షానికి కూలిపోయాయి. తంగళ్లపల్లి-వెంకిర్యాల వాగు మీదుగా ఆగిర్యాల, కాస్లాబాద్, లక్ష్మీదేవిపల్లి, ఎదిర, అలాగే మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్ వరకు రహదారిని నిర్మించారు. ప్రస్తుతం వెంకిర్యాల వాగు ఉధృతంగా పారుతుండటంతో ఆయా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. తంగళ్లపల్లి-వెంకిర్యాల బ్రిడ్జి నిర్మాణం తమ చిరకాలవాంఛ అని ఈ బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో అని ఆయా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

ఈ వాగులకు వంతెనలు నిర్మించాలి

జిల్లేడు చౌదరిగూడ- రావిర్యాల గ్రామాల మధ్యన బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల- లాలాపేట గ్రామాల మధ్య ఉన్న వాగుపై కూడా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే నందిగామ మండలం అంతిరెడ్డిగూడ- నర్సప్పగూడ, నందిగామ- వీర్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగులు రహదారిపై ప్రవహిస్తున్నాయి. ఈ నాలుగు గ్రామాల మధ్యన బ్రిడ్జి నిర్మించాల్సి ఉంది.

కాంట్రాక్టర్లు ముందుకొస్తే పనులు అప్పగిస్తాం

అయ్యవారిపల్లి, వెంకిర్యాల బ్రిడ్జి నిర్మాణాలకు నిధుల కొరత లేదు. కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. వారికి నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పాత వారి అనుమతులను రద్దు చేసి పనులు అప్పగిస్తాం.

- రాజశేఖర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ విశ్రాంత ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ అన్నారు. సోమవారం చందిప్పలోని మరకత శివాలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి ప్రమోద్ ఆయనతో అభిషేకం చేయించి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సదానందంగౌడ్ స్వామివారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హన్మంతు, అర్చకులు వీరేష్ ఉన్నారు.

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

షాద్‌నగర్‌రూరల్/చేవెళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల వారు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం వరకు అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా చేసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సునీత, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు బండారి రమేష్, ఉత్సవ కమిటీ నాయకుడు అందె బాబయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, బీజేపీ నాయకుడు చెంది మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేవెళ్లలో సీఐ ఆధ్వర్యంలో..

పండుగలను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్సైలు సంతోష్‌రెడ్డి, శిరీష సూచించారు. చేవెళ్లలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక మండపల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

కొందుర్గు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి షెకీనానిస్సి సోమవారం ప్రకటనలో కోరారు. అధ్యాపకురాలు ఎంఏ ఎకనామిక్స్, బీఎడ్ అర్హత కలిగినవారు 22వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంగమ్మతల్లికి ఘనంగా పూజలు

కేశంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పోమాల్‌పల్లి - కొండారెడ్డిపల్లి గ్రామ శివారులోని నోటిఫైడ్ చెరువు నిండి అలుగు పారుతుండడంతో గంగమ్మతల్లికి పూజలు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లె ఆనంద్‌కుమార్ నేతృత్వంలో సోమవారం కొండారెడ్డిపల్లి గ్రామస్తులు మేళ, తాళాలు, డప్పు వాయిద్యాల మధ్య పొట్టేళ్లతో ర్యాలీగా చెరువు వద్దకు వెళ్ల గంగమ్మతల్లికి పూజలు చేశారు. అలాగే కట్టమైసమ్మకు నైవేద్యం సమర్పించారు.

ఎడ్మ కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్



కడ్తాలలో కిష్టారెడ్డి వర్ధంతిలో శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ, బీక్యనాయక్

ఆమనగల్లు/కడ్తాల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత ఎడ్మ కిష్టారెడ్డి సేవలు చిరస్మరణీయమని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ అన్నారు. ఆమనగల్లులో సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుత్తి బాలస్వామి ఆధ్వర్యంలో ఎడ్మ కిష్టారెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యనాయక్ నాయకులు బాలస్వామి చుక్క నిరంజన్‌గౌడ్, పూసల భాస్కర్, డేరంగుల వెంకటేశ్, శివకుమార్, యాదయ్య రమేశ్ నాయక్, రమేశ్, ఖుద్దూష్, మణిపాల్, మల్లేశ్, రాహుఫ్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు. కడ్తాలలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డికి నివాళి అర్పించారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

కడ్తాల్/తలకొండపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వంపుగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కడ్తాల గ్రామానికి చెందిన మారేమోని శివ కుటుంబానికి స్థానిక శ్రీనివాస వైన్ షాప్ నిర్వాహకులు చేయూతనందించారు. శివ స్థానిక వైన్ షాప్‌లో పనిచేసేవాడు. వైన్‌షాప్ తరఫున నిర్వాహకులు రూ.లక్ష సమకూర్చగా సోమవారం శివ తల్లిదండ్రులు రవిమంజులకు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్, కేశని యాదయ్య, బుచ్చయ్య, బాలయ్య, లక్ష్మయ్య, అశోక్, జంగయ్య, శేఖర్, బాల్‌రాజ్, శ్రీను, నర్సింహ, జహంగీర్‌అలీ, మల్లేశ్ గౌడ్, రాంచంద్రయ్య, లక్ష్మయ్య ఉన్నారు. అలాగే తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ నిర్మలాశ్రీశైలం గౌడ్, నాయకులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3 వేలను బాధిత కుటుంబానికి సమకూర్చగా మాజీ సర్పంచ్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ పెంటమ్మ అందజేశారు. నాయకులు రామస్వామి, కృష్ణ, శ్రీను, మల్లయ్య ఉన్నారు.

నిర్మాణాల్లో వేగం పెంచాలి

యాచారం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని యాచారం ఎంపీడీవో రాధారాణి అన్నారు. సోమవారం యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, తక్కళ్లపల్లి తండా, నజ్దిక్‌సింగారం, యాచారం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. బిల్లులు వెంటవెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ శిరీష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా శ్రీను

మొయినాబాద్ రూరల్, ఆగస్టు18(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా కట్టమీది శ్రీను ఎన్నికయ్యారు. హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో శ్రీను గెలుపొందారు. అధ్యక్షుడిగా గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యక్షునిగా షాబాద్ సాయి, ప్రధాన కార్యదర్శిగా పైలు శ్రీదర్‌లు గెలుపొందారు.

స్ట్రీట్ లైట్లు ఏర్పాటు

కేశంపేట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పోమాల్‌పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అనుమగళ్ల రమేష్ సహకారంతో మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామంలో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఎనమిది వార్డుల్లో పూర్తి స్థాయిలో లైట్లు వేయించడానికి సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనుంజయకు స్ట్రీట్ లైట్లు అందిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిదురం కృష్ణయ్య, గ్రామస్తులు కృష్ణయ్య, తిరుమలయ్య, పబ్బె నరేందర్, బావండ్ల రమేష్, యాదయ్య, మంగమ్మ, లైన్‌మెన్ వెంకటయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న లక్ష్మారెడ్డి

కందుకూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు సీఎంఆర్ఎఫ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం తుక్కుగూడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నాయకులు బొక్క భూపాల్‌రెడ్డి, బొక్క సంజీవరెడ్డి, సౌడపు శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, బొక్క హన్మమంత్‌రెడ్డి, బొక్క ధామోదర్‌రెడ్డి, కుమ్మరి కృష్ణయ్య, బాలకృష్ణచారి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన అంజలికి మంజూరైన రూ.60 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, రాజురెడ్డి, అజీం, రవీందర్ యాదవ్, యాదగిరి, గణేశ్, ఆరీఫ్, మల్లేశ్, అంజనేయులు, పురుషోత్తం, ప్రహ్లాద్, సుదర్శన్, రామాస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే వెల్దండకు చెందిన వసంతకు మంజూరైన రూ.25,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమనగల్లులో అందజేశారు. కార్యక్రమంలో నిరంజన్, లింగం, శంకర్, ప్రవీణ్, సత్యం, అశోక్, రవి, శ్రీనివాస్, రామచంద్రయ్య, దాసు, జగన్, రామస్వామి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే చర్యలు

చేవెళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని చేవెళ్ల మున్సిపాల్ కమిషనర్ వెంకటేశం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆయా దుకాణాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న వ్యాపారులకు రూ.12 వేలు జరిమానా విధించారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆమనగల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ 7వ వార్డు వేంకటేశ్వర కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ మాజీ కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ కోరారు. సోమవారం కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను వినతిపత్రం అందజేశారు. కాలనీలో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు నిర్మించాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.

సంక్షిప్తంగా..

పాఠశాల అభివృద్ధికి కృషి

కొందుర్గు: పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని బీఆర్ఎస్ నాయకుడు బోడం పాటి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పులుసుమామిడి గ్రామ పంచాయతీ రాంచంద్రపురంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు.

వాగుపై వంతెనలు నిర్మించాలి

కేశంపేట: పెద్దవాగుపై వంతెనలు నిర్మించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్ అజాంఅలీ, ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్యకు వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని పాటిగడ్డ సమీపంలో వాగు పారడంతో గ్రామస్తులు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నరని తెలిపారు.

పనితీరును బట్టే ప్రజల్లో కీర్తి

ఆమనగల్లు: పనితీరును బట్టే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో కీర్తి లభిస్తుందని ఆమనగల్లు ఎస్ఐ వెంకటేశ్ అన్నారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి శంషాబాద్ ఆర్‌జీఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన హోంగార్డు భాస్కర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

వైభవంగా పల్లకీ సేవ

చౌదరిగూడ: మండల కేంద్రంలోని నీలకంఠ స్వామి దేవాలయంలో ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శివుడి పల్లకీ సేవ నిర్వహించారు. చిన్నయ్య స్వామి మఠం పీఠాధిపతి నందీశ్వర స్వామి, పోగుల బాలరాజు, జానయ్య తదితరులున్నారు.



యాచారం: బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు




కొందుర్గు: పర్వతాపూర్‌లో..


ఊరూరా బోనాల సందడి

ఊరూ వాడా బోనాల సందడి నెలకొంది. శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గ్రామ దేవతలకు మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు. పిల్లాజెల్లను చల్లంగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఆగస్టు 18



ఆమనగల్లు: బోనాలతో మహిళలు



కేశంపేట: బోనం సమర్పిస్తున్న భక్తులు



కందుకూరు: బాచుపల్లిలో..